రసాయనాలు పారే విషపూరితమైన కాలువ. ముక్కుకి గుడ్డ కట్టుకుని
నడిచే దారి. చీకటిపురుగుల్లా తిరిగే మనుషులు. వెలుగులో కూడా
తన రూపం కనపడనివ్వని నిగూఢమైన నగరం. ఇలాంటిచోట
ఒక స్వచ్ఛమైన ప్రేమ రెక్కలు విప్పుతుందా? రెక్కలు తెగి కూలిపోతుందా?
అన్న ప్రశ్నలోంచి పుట్టిన కథ.

నాగేంద్ర కాశీ

# 7

# నిశీధి శలభం

చారి పి.ఎస్.





పైపులైన్ రోడ్డు దగ్గర బస్తీ. బస్తీని మూడువైపులా చుట్టేస్తూ, ఇరవై అడుగుల వెడల్పున్న నాలా చీకట్లో అచ్చం కొండచిలువలా ఉంది. దూరంగా ఇండస్ట్రియల్ ఏరియాలో సెకండ్ షిఫ్ట్ సైరెన్ మోగింది. నాలాలో చిక్కగా, రంగు రంగుల్లో నురగలు కక్కుతూ, గాఢమైన వాసనతో, పసుపురంగు ఆవిర్లతో రసాయనాలు మెల్లిగా వస్తున్నాయ్. మూడు రోజులొకొకసారి వచ్చే ఆ రసాయనాలంటే ఆ బస్తీవాళ్లకి భయం, అలవాటు. ఆరోజు పదకొండు గంటలకల్లా తలుపులు మూసేస్తారు. కిటికీలకు వాడని దుప్పట్లు కట్టేసి ముక్కలకి గుడ్డలు కట్టుకుని పడు కుంటారు. రెండు గంటలపాటు దండెత్తి వచ్చిన రాక్షస సైన్యంలా వాయువుల దాడి జరుగుతుంది. వాటిని పీలిస్తే పీల్చిన మార్గాన్ని, ఊపిరి తిత్తుల్ని నక్క మాంసం పీక్కుతిన్నట్టు తినేస్తాయ్. బోరు నీళ్లు పసుపు రంగులో వచ్చినా, నల్లా నీళ్లు వారం రోజులకోసారి వచ్చినా కానీ ఆ బస్తీ వదిలిపోరు. దగ్గర్లో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో పనిచేసే చాలా మంది అద్దె తక్కువని ఇక్కడే ఉంటారు.

బస్తీకి ఒక వైపు ఇంకా ఎవరూ ఆక్రమించని ఖాళీస్థలం, తుమ్మ చెట్లు, రాళ్లతో నిండిపోయుంది. సాయంత్రం చీకటిపడ్డాక నల్లని మనుషులు అక్కడికి చేరతారు. ఏ న్యూస్ ఛానెల్ వాళ్లైనా చూస్తే అసాంఘిక కార్యకలాపాలు అని చూపించడానికి సాక్ష్యంగా రాళ్ల మధ్యలో బీరు సీసాలు, పాన్ పరాగ్ ప్యాకెట్లు ఉన్నాయ్. ఒకరికొకరు కనబడకుండా మూడు గ్రూపులు కూర్చుని ఉన్నాయ్ ఆ గ్రౌండ్‌లో. చేతిలో సీసాలు, సెల్ ఫోన్ ఫ్లాష్‌లైట్ వెలుగులో చిప్స్ పాకెట్లు కనపడు తున్నాయ్. గుప్పుమని నాలా నుంచి వాసన తగిలింది వాళ్లకి. దెయ్యాన్ని చూసినట్టు చూసి, గబాగబా తాగేసి సీసాలు అక్కడే పడేసి పోయారు.

శిరీష ముక్కుకి చున్నీ చుట్టుకుని ఆ తుమ్మచెట్ల నీడలో ఉంది. రమేష్ కోసం చూస్తోంది. ఇద్దరూ ఇండస్ట్రియల్ ఏరియాలో పనిచేస్తారు. కంపెనీల దగ్గర కలవడానికి కుదరదు. రమేష్‌కి పవర్ హాలిడేని బట్టి సెలవు మారుతూ ఉంటుంది. శిరీషకి ఆదివారం సెలవు. అందరూ భయపడే ఆరోజు ఇద్దరికీ ఇష్టమైన రోజు. మూడు రోజుల కొకసారి కలుస్తారు. ఏదో పార్క్‌కి వచ్చినట్టొచ్చి ఆ రెండు గంటలూ

చుక్కలన్నీ లెక్కపెడుతూ ఊసులు చెప్పుకుంటారు. రాతిబండ మీద కూర్చుని ఒకరి ఒళ్లు ఒకరికి మెత్తగా తగులుతుంటే ఒకరినొకరు చూసుకుంటారు. డీజిల్ కూలెంట్‌లో మురికిపట్టిన అతని చేతుల్ని, ఒరిసిన గోళ్లని తన చేతుల్లోకి తీసుకుని నవ్వుల్తో ముగ్గు లేస్తుంది. కెమికల్ కాంపౌండ్స్ వల్ల మచ్చలొచ్చిన ఆమె చేతుల్ని తన పెదాలపై పెట్టు కుంటాడు. రెండు గంటలు ఆ వాయువులు ఇద్దర్ని తడిపేసినా ఆ వాసనే తెలియనట్టు అక్కడుంటారు. చీకటి పురుగులూ, వాళ్లు తప్ప అక్కడ ఇంకెవ్వరూ ఉండరు. మనిషన్న వాడెవడూ ఆ దరిదాపులకు రాడు.

ఇంటర్ ఫెయిలైన శిరీష ఒక థర్మో ప్లాస్టిక్ కంపెనీలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. శిరీష నాన్న వెల్డింగ్ ఆపరేటర్. ఎక్కడో కోయంబత్తూర్ నుంచొచ్చిన ఒకతనితో ఒక వర్క్ షాప్ పెట్టాడు. హై వోల్టేజ్ వల్ల షాప్ తగలబెడితే అప్పులై కోలు కోలేక చితికిపోయాడు. ఒకప్పుడు నాలాకి అవతలవైపు బతికినవాళ్లే. ఇప్పుడు బస్తీకి మారారు. శిరీషకి ఒక చెల్లి. ఆ అమ్మాయి ఇంటర్మీడియట్ గవర్నమెంట్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. ఇంట్లో అప్పులు శిరీషని ఆపరేటర్‌ని చేశాయ్.

అదే ఏరియాలో రమేష్ ఒక వర్క్‌షాప్‌లో సియెన్సి మెషిన్ దగ్గర హెల్పర్‌గా చేస్తున్నాడు. ఐటిఐ చేసి హైదరాబాద్ వచ్చి పనికి జేరి మూడు సంవత్సరాలైంది. ఆ సియెన్సి మెషిన్ ప్రోగ్రామింగ్ నేర్చుకుని మంచి జీతానికి ఏదో ఒక టూల్ కంపెనీలో జాయిన్ అవ్వాలని రమేష్ కోరిక.

కిరాణా షాప్ దగ్గర పరిచయం ఇద్దరికీ. మూగ ప్రేమ మూడు నాలుగు నెలలు నడిచింది, మొబైల్ ప్రేమ ఇంకో నెలరోజులు. తర్వాత డైరెక్ట్‌గా మాట్లాడుకున్నారు. ఐదు రూపాయల దూరం, పది నిమిషాల షేర్ ఆటో ప్రయాణంలో పరిచయం మరింత చిక్కబడింది. ఇద్దరు ఒక్కోసారి లంచ్ బాక్స్‌లు మార్చుకుని సాయంత్రం కలిసినప్పుడు బాక్సుల నిండా మాటలు నింపుకుని తీసుకుపోయేవారు. శిరీష కోసం నాలావైపు బస్తీకి మారాడు రమేష్. ఇంకో ఫ్రెండ్‌తో కలిసి ఒక రెండస్తుల డాబాలో పైన ఉంటున్నాడు. అతని రూమ్ నుంచి చూస్తే శిరీష ఉంటున్న ఇల్లు కనబడుతూ ఉంటుంది.

ఆరోజు నాలాలో కెమికల్స్ వొదిలే రోజు. శిరీష ఆ తుమ్మచెట్టు కిందే నిలబడి ఉంది. రమేష్ రావట్లేదు. ఫోన్ చేసింది. లిఫ్ట్ చేయలేదు. వాట్సాప్‌లో మెసేజ్ పెట్టింది. రిప్లై లేదు.

చున్నీ తీస్తే భరించలేని వాసన. రమేష్  పక్కనుంటే దగ్గరకు రాని వాసన. ఒంటిగంట అవుతోంది. వాళ్ల నాన్న లేస్తాడేమో అని వెళ్లిపోయింది.

* * *

నాలాకి ఇవతలున్న శ్రీ సాయి కిరాణా స్టోర్. రమేష్ కళ్లు నలుపుకుంటూ వచ్చి, “అన్న ఏక్ చోటా గోల్డ్,” అన్నాడు.

“భయ్యా చిక్ షాంపూ ఒకటి,” శిరీష గొంతు వినపడడంతో వెనక్కి తిరిగాడు. నైటీ మీద చున్నీ కప్పుకుని, తల పైకి కొప్పు పెట్టి, డ్రిల్ చేసినట్టు చూస్తా ఉంది రమేష్ వైపు.

“రాత్రి ఓవర్ టైం చేశాను,” అన్నాడు సిగరెట్ తీసుకుంటూ.

“ మెసేజ్ చేశాను, కాల్ చేశాను, రిప్లై ఇవ్వొచ్చుగా,” గ్యాస్‌కట్టర్‌లా ఉంది చూపు.

అందరూ పటేల్ అని పిలిచే కిరాణా షాపు యజమాని ఎవరికో ఉప్మా రవ్వ కడుతూ అలాగే చూస్తున్నాడు.

“మెషిన్ రన్నింగ్‌లో ఉంది, వినపడలేదు. చాక్లేట్ కొనియ్యనా,” అన్నాడు.

“వద్దు నువ్వే తిను,” అని షాంపూ ప్యాకెట్ తీసుకుని వదిలేసిన సిగరెట్ పొగలా మాయమైపోయింది.

రమేష్ నవ్వుతా సిగరెట్ వెలిగించాడు. కోడిగుడ్లు కోసమని వచ్చిన ఒక సంసారి పెద్దపెద్ద గుడ్లేసుకుని అలానే చూస్తున్నాడు. పటేల్ కూడా గుర్రం సకిలించినట్టు నవ్వాడు.

ఆ కిరాణాకొట్టు దగ్గర ఎన్నో ప్రేమ కథలు పుడతాయ్. పంచదార, మైదాపిండి లాంటి రోజువారీ సరుకులు కలిపిన ప్రేమకథలు.

“ఏంది కత,” అన్నాడు పటేల్.

“ఏముంటదన్నా మామూలే,” సిగరెట్ పఫ్ లాక్కొంటూ అన్నాడు రమేష్.

పటేల్ షర్ట్ తీసి పక్కన పెట్టాడు. గోధుమరంగు బనియన్ ఉంది. నల్లగా వొదులుగా కండలు వేలాడుతున్నాయ్. ఛాతి మీద తెల్లటి వెంట్రుకలు కొంచెం బయటికి కనబడుతున్నాయ్. బండ ముక్కు, గార పట్టిన బెల్లంరంగులో పళ్లు, చిన్న పిల్లికళ్లు, జీర గొంతు. చూడగానే నచ్చకపోవటానికి కావాల్సినవన్నీ పోత పోసినట్టుంటాడు నలభై సంవత్సరాల పటేల్.

“ఊ... నీ ఎక్సపోజింగ్ ఏంటన్న, మంచి టీ షర్ట్‌లు వేసుకోవచ్చుగా, డబ్బులన్నీ ఏం చేస్తావన్న? ఇంకా ఫామిలీ లేదు, ఏంలేదు,” పటేల్‌తో ఉన్న చనువుతో అన్నాడు.

పటేల్ నవ్వి తన దేహాన్ని ఇంకొంచెం ఎక్సపోజ్ చేశాడు.

“నా వల్ల కాదన్న,” అంటూ బయటకు వచ్చాడు రమేష్.

గుర్రం సకిలింపు నవ్వు వెనక నుంచి వినపడుతూ ఉంది.

వీధిలో నడుస్తూ శిరీషకి ఫోన్ చేస్తున్నాడు. లిఫ్ట్ చెయ్యట్లేదు. ఇంకో రెండు రోజుల వరకూ ఆగాలా అని మనసులో అనుకున్నాడు.

వీధిలో రోడ్డు. బాచిలర్ రూమ్‌ల దగ్గర ఐదు కేజీల బండ మీద నుండి ఎగ్ ఫ్రై. ఉల్లిపాయల వాసన. ఫామిలీ పోర్షన్ల దగ్గర కుక్కర్ విజిల్స్ పోలీసు ఈలల్లాగా.

మంచినీళ్లు వస్తున్నట్టున్నాయ్ ఇంకా సందడిగా ఉందా వీధి. చాలామంది అమ్మాయిలు ఈరోజు తల స్నానం చేస్తారు.

రమేష్ రూమ్‌కి వెళ్లేటప్పటికి రూమ్మేట్ శీను కూర వండుతున్నాడు.

"మీ లేడీస్ మాట్లాడారా," అన్నాడు.

"లేదు."

"పోన్లే రేపు కచ్చితంగా మాట్లాడుతుంది."

"అదేంటి?"

"ఒరేయ్ రేపు లవర్స్ డే. బజార్లో చూళ్లేదా అడావిడీ. గిఫ్ట్ కొన్నావా?"

రమేష్‌కి అప్పుడు గుర్తొచ్చింది. పది రోజుల క్రితమే అనుకున్నాడు గులాబీ రంగు చుడీదార్ కొందామని. ఒకటో తారీఖు అవసరాన్ని గుర్తు చేసింది కానీ ప్రేమని గుర్తు చేయలేదు. సాలరీ వచ్చిన వెంటనే ఇంటికి కొంచెం, అద్దెకి, పటేల్ దగ్గర కిరాణాకీ కట్టేసాడు. రోజూ వర్క్‌షాప్‌కి వెళ్లి రావడానికి తప్ప చేతిలో ఒక్క పైసా లేదు. పరిచయమై సంవత్సరమైనా ఇప్పటివరకూ ఏం కొనివ్వలేదు. ఎప్పుడో ఒకసారి సినిమాకి తీసుకెళ్లడం తప్పించి.

"నేను శాలరీ వచ్చినప్పుడే చెప్పాను," అన్నాడు శీను.

"లవర్స్ డేకే ఇవ్వాలంటావా, బర్త్ డేకి ఇస్తే?"

"బర్త్ డేకి  ఆ పిల్ల నాన్న ఇస్తాడు. లవర్స్ డేకి నువ్వు మాత్రమే ఇవ్వాలి. ఆ రోజు ఏం ఇవ్వకపోతే నిన్ను లవరంటారా అసలు. బయట చూడరా. ఇదేమన్నా మన ఊరనుకున్నావా. మన ఊర్లో కూడా ఈ మధ్యన చేసుకుంటున్నారు."

"నీ దగ్గర డబ్బులేమైనా ఉన్నాయా?"

"మనిద్దరమే కదా మా బావ క్యాటరింగ్ పెడతానంటే మాయక్కకి పదివేలు నా జీతం మొత్తం ఇచ్చి వచ్చింది."

"పోనీ  మీ అక్కని ఓ రెండు వేలు అడుగుతావా ?"

"ఊఁ..సాయంత్రం పోదామయితే."

"నేను ఈ లోగా మా శేట్‌ని అడుగుతా. మొన్నే జీతమిచ్చాను కదాని తిడతాడ్రా బాబూ హిందీలో," అని నీరసంగా కూర్చున్నాడు.

శీను బాక్స్‌లు సర్దేసాడు. స్నానాలు చేసి డ్యూటీలకి బయల్దేరారు. సాయంత్రానికి రెండు వేలు సంపాదించాలి. ఇద్దరూ నాలా దాటారు. పటేల్ కిరాణా కొట్టు దాటారు.

"రేపు రమేష్‌కి షర్ట్ కొనిద్దాం అనుకుంటున్నా. సాయంత్రం వెళ్లేటప్పుడు కొందాం. మీ ఇంట్లో పెడతా, పొద్దున్నే వచ్చి తీసుకుంటా, ప్లీజే," అంది శిరీష తన ఫ్రెండ్‌తో.

"సరే, ముందు ఆ సూపర్‌వైజర్‌గాడి కంట్లో పడకు. వస్తున్నాడు. నువ్వు జాయి నయిన దగ్గరనుంచీ నిన్ను ట్రై చేస్తున్నాడు."

శిరీష మెషిన్ దగ్గర అలెర్ట్ అయింది.

సూపర్‌వైజర్ కోటి వచ్చాడు. డైలీ ప్రొడక్షన్ లాగ్ బుక్ చూస్తూ శిరీష వంక చూస్తున్నాడు. తుప్పు పట్టిన ఇనుపముక్కల్లా ఉన్నాయ్ అతని చూపులు.

"ఏంటి శిరీష సంగతులు," అడిగాడు బూడిదరంగు నోటితో.

శిరీష ఏం మాట్లాడలేదు.

"నువ్వెక్కడుంటావ్?"

"పైప్ లైన్ రోడ్డు బస్తీ సార్."

"ఆ నాలా అవతలా?"

అవునన్నట్టు తలూపింది.

ప్రొడక్షన్ మేనేజర్ వస్తుండడంతో అక్కడనుంచి కదిలాడు.

"ఇంతకీ డబ్బులెక్కడివే," అంది.

"మొన్న శాలరీ వచ్చినప్పుడు హాస్పిటల్‌కి వెళ్లాలి అని రెండు వేలు సైడ్ చేశా. మా అమ్మకి డౌట్ వచ్చింది కానీ ఏం అనలేదు. అమ్మ దగ్గరే పెట్టాను," అని కన్ను కొట్టింది.

"షర్ట్ ఎక్కడ కొంటావ్? అయినా ఎందుకిప్పుడు?"

"మేము లాస్ట్ ఇయర్‌లో మూడుసార్లు సినిమాకి వెళ్లాం. మూడుసార్లు ఒకే షర్ట్. అతని దగ్గర బాగున్న షర్ట్ అదొక్కటే పాపం. అయినా ఇది మా ఫస్ట్ లవర్స్ డే. బ్లూ చెక్స్ షర్ట్ కొంటా. రమేష్‌కి బలే ఉంటుంది బ్లూ కలర్," అంది.

*   *   *

శిరీష ఇంటికెళ్లి, మొహం కడుక్కుని, "అమ్మా, ఆ రెండువేలు ఇవ్వవే," అంది పౌడర్ రాసుకుంటూ.

వాళ్లమ్మ టీ చేతికిచ్చి, "నాలా అవతల ఏదో ఇల్లు ఖాళీ అయిందంట, అడ్వాన్స్ అడిగితే రెండు వేలు తక్కువొచ్చినై. నువ్వు ఇచ్చిన డబ్బులు మీ నాన్నకి ఇచ్చేసా. ముందు ఇక్కడ్నుంచి వెళ్లిపోవాలి. నేను ఈ ఆస్తమాతో పడలేనే. నీ డబ్బులు మళ్లీ ఇచ్చేస్తా," అంది.

శిరీషకి కోపం వచ్చి పౌడర్ డబ్బా విసిరికొట్టి, "అవి నా డబ్బులు. ప్రతినెలా ఈ ఇంట్లోకే పెడ్తున్న కదా. పెంచకపోతే అప్పుడే చంపేసి ఉంటే బాగుండేది," అని ఏడుస్తూ హ్యాండ్ బాగ్ తీసుకుని బయటికి వచ్చేసింది, వాళ్లమ్మ పిలుస్తున్నా వినకుండా.

పటేల్ కిరాణాకొట్టు దగ్గర నిలబడింది. ఫ్రెండ్‌కి ఫోన్ చేసింది.

“మా అమ్మ డబ్బులు మా నాన్నకి ఇచ్చేసిందే. నీ దగ్గర ఉన్నాయా?” అంది.

”నీకు తెలుసు కదే. మొన్నే చిట్టీ కట్టడానికి చైన్ తాకట్టు పెట్టేసాను. నే వస్తున్నా ఆగు. నాకు తెలిసిన ఆంటీ ఉంది. వెళదాం,” అంది.

పటేల్ షాపులో నుంచి అలాగే చూస్తున్నాడు.

శిరీష తన మెళ్లో ఉన్న రోల్డ్‌గోల్డ్ చైన్‌ని తడుముకుంది. ఏడిస్తే బాగోదు అని చున్నీ నోటికి అడ్డుపెట్టుకుని అక్కడే మెట్లమీద కూర్చుంది. ఎందుకో వాళ్ల నాన్న చేసిన అన్ని తప్పులూ ఒక్కసారిగా గుర్తొచ్చాయ్, అప్పుడప్పుడు తాగొస్తాడు. వచ్చి వాళ్ల అమ్మ మీద చెయ్యేస్తాడు. ఉన్నది ఒక్క గదే అనీ, ఒక ఆడపిల్ల ఉందనీ మర్చిపోతాడు. తాగొచ్చినప్పుడు ఇయర్ ఫోన్స్ పెట్టుకుని ఎక్కువ సౌండ్‌తో పాటలు వినేది. అప్పుడు కూడా తనేం బాధపడలేదు.

రమేష్... అతని రెండు చేతుల మధ్యా ఎంత స్వేచ్ఛ దొరుకుతుంది! రోజు ఏదో తెలియని ఆనందంతో మొదలవుతుందంటే అతనే కారణం. అతనితో ఇరుకిరుకు షేర్ ఆటోలో చేసిన ప్రయాణం ఎంత గొప్పగా ఉంటుంది! అతనికి కనీసం ఒక షర్ట్ కొనివ్వలేని అసహాయత. శిరీషకి ఏడుపు తన్నుకొస్తోంది. అంతలో తన ఫ్రెండ్ వచ్చింది. ఇద్దరూ కలిసి ఆంటీ దగ్గరికి బయలుదేరారు.

* * *

రమేష్ శీనుతో కలిసి అతని అక్క వాళ్లింటికి బయలుదేరారు.

“మీ శేట్‌ని అడిగావా?”

“ఈరోజు వేరే ఆపరేటర్ వల్ల డైమండ్ టూల్ విరిగిపోయింది. అడిగితే అక్కడే చంపేస్తాడు. చాలా చిరాకులో ఉన్నాడు,” అన్నాడు రమేష్.

ఇద్దరూ వెళ్లేటప్పటికి చీకటిపడిపోయింది. ఇరుగ్గా ఉన్న కాలనీ. రెండు మూడు కర్రీ పాయింట్స్ ఉన్నాయ్ ఆ వీధిలో. శీను అక్క వాళ్లింటికి వెళ్లేటప్పటికి సగం తీసిన తలుపులో నుంచి కేకలు వినబడుతున్నాయ్. లోపలికెళ్లి చూసాడు శీను. వాళ్లక్కని కొడుతున్నాడు అతని బావ. విసురుగా వెళ్లి అతన్ని ఒక తోపు తోస్తే మూలన పడ్డాడు. మందు తాగుండడం వల్ల మళ్లీ లేవలేకపోయాడతను.

రమేష్‌కి ఆశ చచ్చిపోయింది.

బయట కూర్చున్నాడు. లోపలి నుంచి కేకలు. ఇంక వినలేక ఒక్కడే బస్సెక్కి వచ్చేసాడు.

పటేల్ షాప్ ఇంకా మూయలేదు. జనం పల్చగా ఉన్నారు వీధిలో. ఎవరో కుర్రాళ్లొచ్చి కిన్లే సోడా తీసుకుపోయారు. చొక్కా తీసి బయట పెట్టిన ఉల్లిపాయలు, కొబ్బరికాయలు లోపల సర్దుకుంటున్నాడు. చూసి నవ్వాడు. రమేష్ ఒక సిగరెట్ తీసుకున్నాడు. యెర్రని పొగని గుండెలో నుంచి వదిలాడు.

శిరీష... రోజూ తనతో మాట్లాడుతుండబట్టే ఊరిని వొదిలి, అమ్మా నాన్నల నొదిలి ఉండగలుగుతున్నాడు. జ్వరం వస్తే అమ్మలా కంగారుపడుతుంది. సిగరెట్లు తాగితే నాన్నలా తిడుతుంది. కనీసం ఒక డ్రెస్ కొనలేకపోవడం... సరిపోని జీతం మీదా, సంపాదించలేని అసమర్థత మీదా కోపం వచ్చింది.

* * *

శిరీష, ఆమె ఫ్రెండ్ తాళం వేసున్న ఆంటీ ఇంటి ముందు నిల్చుని ఉన్నారు. పక్కింటి వాళ్లని అడిగితే ఊరు వెళ్లిందని చెప్పారు. శిరీష డీలాపడిపోయింది.

"సరే పనవ్వదులే, పద. డేట్ వచ్చింది రాలేను అని మెసేజ్ పెడ్తా రమేష్‌కి," అంది.

"నీ గురించి అతనికి అన్నీ తెలుసు, నీ డేట్ కూడా. నాకు ఒక్క గంట టైం ఇవ్వు, ఒకరున్నారు, ఖచ్చితంగా పనవుద్ది," అంది ఫ్రెండ్.

శిరీష అసహనంగా నవ్వింది.

* * *

"ఇది మూడో సిగరెట్, ఏంటి సంగతి," అన్నాడు పటేల్.

అప్పుడు గుర్తొచ్చింది రమేష్‌కి మూడు సిగరెట్లు తాగానని. పటేల్‌ని ధైర్యం చేసి డబ్బులు అడిగేద్దాం అనుకున్నాడు. కానీ ఇలా అప్పు తీసుకుని తిరిగి చెప్పిన రోజుకి ఇవ్వని ఒకతనికి పటేల్ చేసిన అవమానం రమేష్‌కి గుర్తుంది. భయం వేసింది. కానీ తప్పదు. అడిగేశాడు. పటేల్ గల్లాపెట్టెలోనుంచి పదిహేను వందలు తీసిచ్చి రెండు రోజుల్లో ఇవ్వాలి అన్నాడు.

ఒక్కసారి నల్లగా ఉన్న పటేల్ కొండమీద మూలవిరాట్టు రూపంలో కనిపించాడు.

* * *

పొద్దున్న శిరీష లేవకుండా అలాగే పడుకునుంది. వాళ్లమ్మ అడిగితే డ్యూటీ కెళ్లనని చెప్పింది. వాళ్ల నాన్న ఆ మాట వింటూ అలా చూసి వెళ్లిపోయాడు. కొంచెం సేపటి తర్వాత శిరీష ఫ్రెండ్ ఇంటికొచ్చి మెల్లిగా చెవిలో, "డబ్బులు దొరికాయ్, రా బయటకు వెళదాం," అంది.

శిరీష లేడిపిల్లలా లేచి రెడీ అయింది. ఇద్దరు బజార్లోకొచ్చారు. ఒక పెద్ద షాప్ లోకెళ్లి ఒక బ్లూ చెక్స్ షర్ట్ కొన్నారు.

"ఇంతకీ డబ్బులు ఇచ్చిన మహానుభావులెవరు," అడిగింది శిరీష బిల్ పే చేస్తూ.

"ఎవరో ఉన్నార్లే, కానీ రెండు రోజుల్లో ఎలాగోలా ఇచ్చేయాలి," అంది.

"ఇచ్చేద్దాం. నీవి రెండు నావి రెండు, నాలుగు కిడ్నీలు," అంది నవ్వుతా.

రమేష్ గులాబీరంగు చుడీదార్ కొన్నాడు.

ఇద్దరూ కొత్తగా పెట్టిన మాల్‌లో కలిశారు. లోపల చల్లని గాలి. కొత్త గాలి. ఊపిరాడని గాలి. సెక్యూరిటీ గార్డ్, ఫ్లోర్ క్లీన్ చేసే స్వీపర్ మాత్రమే తనకి తెలిసిన మనుషుల్లా అనిపిస్తున్నారు. ఒక మూలగా కూర్చున్నాడు. వెలుగులో తన పాత షూస్ మీద ఆయిల్ మరకలు స్పష్టంగా కనబడుతున్నాయ్. వాలెంటైన్స్ డే సందర్భంగా ఎర్రటి హృదయాకారంలో ఉన్న బెలూన్స్‌తో నిండి ఉందా మాల్. ఫుడ్ కోర్ట్‌లో లవర్స్‌కి ఏవేవో ఆఫర్స్. అక్కడ సౌకర్యంగా ఉన్నా, నాలా దగ్గర దొరికిందేదో పొగొట్టుకున్నట్టు అనిపించింది ఇద్దరికీ. ఫుడ్ కోర్టులోకెళ్లి తెలియందేదో తిని బయటపడ్డారు.

బయట సెక్యూరిటీ కౌంటర్ దగ్గర ఇద్దరూ బాగ్‌లు తీసుకున్నారు.

ముందుకొచ్చి కొంచెం చీకట్లో, డ్రెస్ ఉన్న పాకెట్ తీసిచ్చి బుగ్గ మీద చిన్న ముద్దు పెట్టాడు. షర్ట్ వున్న కవర్ చేతిలో పెట్టి, "నేను రాత్రి గ్రౌండ్‌లో ఇస్తా," అని నవ్వుకుంటూ వెళ్లిపోయింది శిరీష.

రెండు రోజులైంది.

పటేల్‌కి డబ్బులు తిరిగి ఇస్తానన్న రోజు అది. రమేష్‌కి భయం వేసింది. జీతం వచ్చినప్పుడు ఇస్తానని చెప్పే ధైర్యం లేదు.

కావాలనే లేట్‌గా వచ్చాడు. పటేల్ షాప్ కట్టేసుంది. హమ్మయ్య అని రూమ్ కెళ్లాడు.

పటేల్ నుంచి ఫోన్. రమేష్‌కి గుండెల్లో దడ పట్టుకుంది. మొట్టమొదటిసారి చేసిన అప్పు.

ఫోన్ లిఫ్ట్ చేశాడు.

"పైసలు ఇస్తా అంటివిగా."

"అన్నా అది, జీతం..." మాట పెగలడం లేదు.

"సర్లే గ్రౌండ్ కానికి రా."

"వస్తున్నా అన్నా," అని ఫోన్ పెట్టేసాడు.

భయం భయంగా గ్రౌండ్‌కి బయలుదేరాడు.

* * *

శిరీష పడుకుని మాల్‌లో తీసుకున్న సెల్ఫీలు చూస్తోంది.

సూపర్ వైజర్ కోటి ఫోన్. కాల్ లిఫ్ట్ చేసింది.

"నా డబ్బులు," అన్నాడు.

"మీ డబ్బులేంటి సార్."

"మొన్న మీ ఫ్రెండ్ తీసుకుంది నీకేదో అర్జెంటుగా అవసరమైనదని."

శిరీషకి చెమటలు పట్టేసాయి. బయటకొచ్చింది.

"సార్, జీతం వచ్చినాక ఇచ్చేస్తా సార్," అంది.

"మీ ఇంటి గ్రౌండ్ పక్కనే ఉన్న, ఒక్కసారి ఇటురా మాట్లాడే పనుంది," అన్నాడు కటువుగా .

శిరీష ముక్కుకి చున్నీ కట్టుకుని గ్రౌండ్‌లోకొచ్చింది. ఆరోజు కెమికల్స్ వొదిలే రోజు.

ఎవరూ లేరు. దూరంగా ఎవరో ఇద్దరు వ్యక్తులు కనబడుతున్నారు.

తుమ్మచెట్ల నీడలో ఉన్నాడు కోటి. దగ్గరకెళ్లింది.

రమేష్‌కి దూరంగా తుమ్మచెట్టు దగ్గర ఇద్దరు మనుషులున్నట్టు తెలుస్తోంది.

పటేల్ మందు తాగుతున్నాడు.

"డబ్బులొద్దులేగానీ," అని పటేల్ చొక్కా తీసి రమేష్ తొడమీద చెయ్యేసి నొక్కాడు.

ఒంట్లో నీరంతా కళ్లలోకొచ్చేసింది రమేష్‌కి.

ఇండస్ట్రియల్ ఏరియాలో సెకండ్ షిఫ్ట్ సైరెన్ వినిపించింది.

"జీతం పక్కనపెట్టు, డబ్బులొద్దులే," అని శిరీష భుజం మీద చెయ్యేశాడు కోటి.

నాలాలో వచ్చే కెమికల్స్ కంపుకొట్టింది ఒక్కసారి అతని దగ్గర. కళ్లలో నీరు దిగి ముక్కుకి కట్టుకున్న చున్నీలోకి ఇంకిపోయాయ్.

నాలాలో పసుపురంగు ఆవిర్లతో, గాఢమైన వాసనతో దండెత్తి వస్తున్నాయ్ వాయువులు.

కానీ మొట్టమొదటిసారి మనుషుల కంపే ఎక్కువ కొట్టింది వాళ్లిద్దరికీ.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*28 జులై 2019*

*



10 జులై 1983న తూర్పు గోదావరి జిల్లాలో పుట్టిన **నాగేంద్ర కాశి** మొదటి కథ **కొయిటా అబ్బులు** వాకిలి అంతర్జాల పత్రికలో ఫిబ్రవరి 2015లో వెలువడింది. ఇప్పటిదాకా 12 కథలు రాశారు. రెండు సినిమాలకు సహ రచయితగా పనిచేశారు. ఒక వెబ్ సిరీస్‌కి, రెండు సినిమాలకు మాటలు రాస్తున్నారు. ఏరోస్పేస్ ఎంఎన్‌సిలో సీనియర్ డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగం.

**చిరునామా: సి/123, వెంగళరావునగర్, హైదరాబాద్ - 500 038.**
***ఫోన్: 87901 98928     prasad.kbn2010@gmail.com***